ఇది తిరిగివచ్చేసూచనలు లేవు. మనలో మనవాళ్లు ఏర్పాటు చేసుకున్న చట్టమేరా ఇది. ఎవరుపోయినా సరే యిదిపోదు.'

'హిందువులికి వినాశకాలం వచ్చిందయ్యా. మతగౌరవం తగలడిపోయేరోజులు వచ్చాయి. బ్రాహ్మణ్యం చెడిపోతోంది. ఇదంతా కలికాలమహిమ. ఇంకా ముందు ముందు ఎటువంటివి వస్తాయో ఏమిటో!'

'మనవాళ్లు పూర్వాచారులు అయేవరకూ ఇటువంటివి తప్పవనుకో! పూర్వాచారమనేది ఒకటే ఇటువంటివాటి కన్నిటికీ దివ్యౌషధం.'

'మరే.'

---

# నందన కరువు

[ నూకేళ్ళ కిందట ]

సుబ్బయ్య: నందనసంవత్సరం కరువుకాలందాటి మనం బతుకుతాం అనుకో లేదురా రాముడూ!

రామశాస్త్రి: ఏదో నాలుగురోజుల కొకపూట పిడికెడు మెతుకులు తిని బతికేం.

వెంకటశాస్త్రి: తిండి నాలుగురోజుల కొకపూట దొరికినా ఎక్కడపడితే అక్కడ మంచినీళ్లు దొరికినాబాగుండును. మంచి నీళ్ళేమిటి నీళ్ళంటూ దొరికినా బాగుండేది.

సు: నీళ్ళుదొరికితే ఇంక కరువేమిట్రా.

రా: కృష్ణ మొదలు నెల్లూరువరకూ ఒక్కచుక్క లేదంటే నమ్ము.

సు: పొలాల్లో విత్తనాలు చల్లారే. నీళ్లుంటేగా దున్నడానికి. విత్తనాలుకూడా తిగలేసుకోడమెందుకు ఎప్పుడో ఒకప్పుడు ఒక పూట గడుస్తుంది కదా అని అవీ జాగ్రత్త పెట్టుకొన్నారు ప్రజ.

వెం: మనమాటకేంగాని శూద్రాదులురా కేవలం మట్టి తిన్నారు, అంతకంటే మరేం దొరకక. దొరికినన్నాళ్ళూ గొడ్లను చంపుకుతిన్నారు. అప్పటికీ లక్షలు లక్షలు ఎగిరి పోయారు. రోడ్లమ్మట శవాలేగదా. నక్కలకీ, రాబందులికీ పండగ. ఊళ్ళన్నీ శ్మశానాలయాయి.

రా: నక్కలయి పుట్టినా బాగుండేదిరా బతికుందురు ప్రజ.

సు: అందరూ నక్కలయితే మళ్లా అదీబాధే.

రా: కొంతమందే నక్కలవడం.

సు: ఆరోజులు తలచుకుంటే గుండె ఝల్లుమంటూంది.

రా: నావొళ్లు జలదరిస్తూంది.

వెం: ఈదేశం విడిచి మహారాష్ట్రంలో కెయిరానైపు బ్రాహ్మలూ, కోమట్లూ, లేచిపోయారు చాలామంది.

సు: గుంటూరులో కలరా తిరిగితిరిగివచ్చి నాశనంచేసేసింది.

రా: కలరా అదో దేవత అంటారు.

సు: దేవతాకాదు. దెయ్యంకాదు. మనని నాశనం చెయ్య డానికొచ్చిన మహారోగం. అంతకుముందు ధగ్గులబాధ, దాని మీాద కలరా, దానిమీాద కరువు.

రా: ధగ్గులంత మోసగుట్టు ముండాకొడుకులు ప్రపంచంలో లేరురా. గొంతుక్కి చేతిరుమాలు ఉరిపోసి చంపడం.

వెం: ఏదయినా వెనకటి పిండారీలకంటే నయమే.

సు: వాళ్లువూళ్ళో చొరబడి డబ్బువున్న వాళ్ళనీ లేనివాళ్ళనీ కూడా వొళ్ళుకాల్చి వరికి చంపేరు.

వెం: మనదగ్గిర కత్తులూ కటారులు వున్నాయన్నమాటే గాని అని మనకంటే వాళ్లకే వుపయోగపడేవి.

సు: తూర్పున యిప్పటికీ ఇంతకంటే నరకంగా వుందయ్యా.

రా: ఏం.

సు: మామూళ్లుగా దొంగలబాధ.

రా: సరే.

సు: దానిమీద బందిపోట్లబాధ, ఊళ్ళకి వూళ్ళే నాశనం చేసెయ్యడం.

రా: ఊఁ.

సు: జమీందారులే దొంగలగురువులు. వాళ్లు దొంగలను తయారుచేసి ఊళ్లమీదకు పంపుతారు దోచుకోడానికి. తర్వాత పంచుకొంటారు.

రా: అబ్బ! అక్కడి బతుకు చెప్పలేం.

వెం: చెప్పేదేమిటి? బతకడంకంటే చావడం మేలు.

సు: పద్మనాభ యుద్ధంతర్వాత దేశం చెడిపోయిందిరా.

రా: ఊఁ

సు: చిల్లర జమీందారీలు తయారయాయి. సరిహద్దుల కోసం వీళ్ళలో వీళ్ళు కొట్లాడుకుంటూ వుండడం. ఇంగ్లీషు వాళ్ళతో పితూరీలు. దీనికి మహా కారణంకూడా వుంది.

రా: ఊఁ

సు: జమీందారుకంటే పోలీసాడికి ఎక్కువ అధికారం యిచ్చేశాడు తెల్లవాడు.

రా: పోలీసాడికి, చదువులేనివాడికి అధికారమా?

సు: అందుచేతే బోలెడన్ని పితూరీలు. తూర్పంతా పితూరీలే. ఒక్క బందరుజిల్లా శాంతంగావుంది.

వెం: ఒక్క ప్రభుత్వమంటూ ఏడిస్తేగా. ఎవళ్లకి వాళ్ళే ప్రభువులు. నానాబీభత్సంగానూ వుండంటే నమ్ము. అవతల మనవాళ్లు రాజులయినా బాగుండును లేక తెల్లవాళ్లు దొరలయినా బాగుండును. అదీ ఇదీ లేకపోవడంవల్ల ఎవరిమటుకు వారే రాజులు. నలుగురిని పోగుచెయ్యడం ఆమట్టుగు పితూరి. ఊళ్ళు కొల్లగొట్టడం, తినడం.

సు: ఇంగ్లీషువాళ్ళదే పైచెయ్యి అవుతుందిరా క్రమేపీ.

రా: ఎవరిదయితే మనకేం. దేశమంతా సుఖంగా వుంటే చాలు. ఎప్పుడొస్తాయో ఆ రోజులు.

వెం: ఇప్పుడున్నస్థితిలో కాలుగడప అవతల పెట్టలేకుండా వున్నాంకదా. ప్రాణభీతి. హైద్రాబాద్‌లో పట్టపగలు ఖూనీలు జరిగి పోతూవుంటాయి నడిరోడ్డుమీద. ఎవడికి వాడే కత్తి చేత్తో పట్టుగుతిరగాలి. ఏ మొస్తుందో ఏమిటోఅని.

సు: తెలుగువాడిగతే యిలాగుంటే తక్కినవాళ్ళగతి యింకెలా గుంటుందోచెప్పు.

రా: ఏం ?

సు: దేశం నాలుగుమూలలా తిరిగేవాడు ఒక్క తెలుగువాడేకదా. కన్యాకుమారి దగ్గరనుంచి కాశ్మీరంవరకూ తెలుగువాడు వెళ్లనిస్థలం లేదుకదా. తెలుగు వాడికుండే ధైర్యసాహసాలు మరెవ్వరి కున్నాయి.

రా: మరెవ్వడూ వెళ్ళడంటావు!

సు: ఇంకవెళ్లేవా ళ్ళెవళ్లురా. అరవవాడా పిరికిపంద, ఇల్లు కదలడు. కన్నడలు భూమి పండితే తిందాం లేకుంటే వస్తుందా మంటారుగాని మరోచోటికి వెళ్ళరు. పూనా సంస్థానం చెడిపోయింది కాబట్టి ఒక్క మహారాష్ట్రులు హిందూస్తాన్ బస్తీ

లలో ఇప్పుడు ప్రవేశిస్తున్నారు. ఘూర్జరులు కులాభిమానులూ వర్తకసంచు తెలిసినవాళ్ళూ కాబట్టి మరో చోటికివెళ్ళారు. పంచగౌడులు దక్షిణానికిరారు. బంగాళీలు అరవలకంటే పిరికి పందలు. మొత్తంమీద వారంతా అన్నంతినే నేల చాలా నిస్సారమైనదని గర్వపడి ఈ దేశానికిరారు. ఇంక మనం తెలుగు వాళ్ళం ఎక్కడచూసినా మనమే. అలాంటి మనబతుకే యిలా గుంటే ఇంక తక్కినవాళ్ళ సంగతి చెప్పేదేమిటి.

రా: చెన్నపట్నం కబుర్లు ఏరోజు కారోజే ఇక్కడ కొచ్చేస్తూ వుంటాయి.

వెం: ఉప్పాడ బోయీలకున్న ప్రాశస్త్యం ఇతర జాతుల వాళ్ళకి లేదుకదా. చెన్నపట్టణంలో అంతా వాళ్ళే.

రా: పోనీ తెలుగుపట్టణం కాబట్టి చెన్నపట్టణానికి వెళు తున్నారనుకోరాదూ.

వెం: అంతేకాదు. వాళ్ళతో సమానమైనవాళ్లు లేరుకాబట్టి వాళ్ళని బతిమాలుకుని తీసుకెళుతున్నారు చెన్నపట్టణానికి.

సు: హోల్కార్, పీష్వా, సింధ్యాలు చెడిపోడం మనకి ముప్పొచ్చిందిరా.

వెం: ఏం?

సు: అక్కడికి వెళ్ళిన మనవాళ్లు తిరిగి రావడంలేదు. సంపా దించుకొద్దామని బయలుదేరి ఉత్తచేతులతో తిరిగిరావడమా అని అక్కడే వుండిపోతున్నారు. ఇంటివద్దర పెళ్లాం బిడ్డలు కొట్లాడిపోతున్నారు.

వెం: వెళ్ళినపని చూసుకొనిరావాలి కాని వుత్తనేవస్తే యేం లాభంరా.

సు: వాళ్ళింకా రాలేదుకదా అని కొత్తజట్టు బయలుదేర

కుండా వున్నారు.

వెం: మహారాష్ట్ర సంస్థానాలు చెడిపోవడం మనికు ముప్పొచ్చిందిరా.

రా: పోనిద్దూ మహారాష్ట్రులతో పాటు మనవాళ్లుకూడా హిందూస్థానీ బస్తీలు చేరుకుంటారు.

సు: మనమేమీ అరవలమా, కన్నడులమా బంగాళీలమా దేశసంచారం చెయ్యడానికి, భయపడడానికి.

వెం: అంచేతె మనం తక్కిన వాళ్ళకంటే బాగుపడుతున్నాం.

సు: నిజమే.

---

# * నియోగి - వైదీకీ

[నూకళ్ళ కిందట]

అన్నంభట్లు: ఒరే కొండురావూ!

కొండుశ్రౌతి; ఓరి నీ అమ్మకడుపిదయిపోను, నన్ను కొండురావంటా వేమిట్రోయ్!

బ్రహ్మావధాన్లు: (నవ్వుతాడు)

అన్న: (పిచ్చయ్యశాస్త్రితో) తప్పేముందిరా పిచ్చయ్యస్వామీ!

పిచ్చయ్యశాస్త్రి: అదేమిట్రోయ్! నాకూ కొత్తపేరెట్టావు! నీ తెలివితేటలు కాలినట్టేవున్నాయి.

బ్రహ్మ: (నవ్వుతాడు)

---

* వీణ మే 1938